భారత రాజ్యాంగ పీఠిక పుస్తకావిష్కరణ



భారత రాజ్యాంగ పీఠిక పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కేంద్ర సమాచార హక్కు చట్టం మాజీ కమీషనర్, నల్సార్ యూనివర్సిటీ ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్ రచించిన భారత రాజ్యాంగ పీఠిక పుస్తకాన్ని శనివారం ఆవిష్కరించారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సాహితీమిత్రుల ఆధ్వర్యంలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ నేడు భారత రాజ్యాంగాన్ని కాపాడుకున్నది సామాన్యులేనని అన్నారు. సహజ వనరులు, సంపదను ఎవరి చేతుల్లోకి వెళ్లకుండా ఉండే దిశగా ప్రభుత్వాలు కృషి చేయాలని రాజ్యాంగంలో పొందుపరిచి ఉందన్నారు. భారత రాజ్యాంగాన్ని అంబేద్కరే రచించారని ఆయన రాజ్యాంగ నిర్మాతలో ముందు వరుసలో ఉంటారని తెలిపారు.

కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు కె.రామచంద్రమూర్తి, ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ కొదండరామ్, ఎంఎస్‌కో పబ్లిషర్స్ విజయ్‌కుమార్, శ్రీశ్రీ ప్రింటర్స్ ప్రతినిధి విశ్వేశ్వర్‌రావు, డాని తదితరులు పాల్గొని ప్రసంగించారు.

ఏం కొనేటట్టు తినేటట్టు లేదు

- వాతావరణ మార్పులతో తగ్గిన దిగుబడి
- కర్రీపాయింట్లకు పెరిగిన గిరాకీ

రారెత్తిస్తున్న టామాటా ● ఘటెకిస్తున్న మిర్చి

సనత్‌నగర్: సీజన్‌లో మార్పులు కూరగాయాల ధరలను అమాంతంగా మార్చేశాయి. టా'మోత' తారెత్తిస్తుంటే.. బెండకాయ బేర్ మనిపిస్తోంది. పచ్చిమిర్చి ఘాటులో అ'ధర'హో అంటుండగా.. ఉల్లి పొగరు కన్నీళ్లను తెప్పిస్తోంది. ఇక బీన్స్ ధర చూస్తే కళ్లు తేలేసే పరిస్థితి. అదే బాటలో చిక్కుడు, క్యారెట్, క్యాప్సికమ్..ఇలా దాదాపు అన్ని రకాల కూరగాయల ధరలు అమాంతం పెరిగి సామాన్య ప్రజానీకం నడ్డివిరుస్తున్నాయి. ఎండాకాలంలో కూడా అంతగా కూరగాయల ధరలు పెరగకపోయినా వర్షాకాలం ప్రారంభంలో చుక్కలు చూపిస్తున్నాయి. రైతుబజార్‌లోనే ధరలు ఆకాశన్నంటేలా ఉండగా, ఇక బహిరంగ మార్కెట్లో ఏ కూరగాయ ధర చూసినా కిలో రూ.60లకు తక్కువ లేదు. కొన్ని అయితే ఏకంగా మూడంఖ్యల సంఖ్యను చేరాయి. పాత పంటలు స్థానంలో ఇప్పుడు కొత్త పంటలు వేయడం.. అలాగే వర్షాలు విరివిగా పడుతుండడంతో ట్రాన్స్‌పోర్ట్ సమస్యలు తలెత్తడం..ఇలా కారణాలేమైనా కూరగాయల ధరలు మాత్రం సామాన్య, మధ్య తరగతి ప్రజల బడ్జెట్‌పై పెను ప్రభావాన్నే చూపుతున్నాయి.



ఎర్రగడ్డ రైతు బజార్‌లో కూరగాయలు కొనుగోలు చేస్తున్న దృశ్యం

ఎందుకీ పరిస్థితి..

మార్కెట్లోకి రావాల్సిన కూరగాయల రాబడి భారీగా పడిపోయింది. క్వింటాళ్లలో దిగుబడి ఒక్కసారిగా తగ్గిపోవడంతో ధరలు పెరిగిపోయాయని మార్కెట్ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. ముఖ్యంగా వాతావరణంలో మార్పులు, సీజన్ మారడంతో కొత్త కాపు కోసం పంటలు వేస్తుంటారు. ఈ నేపథ్యంలో పాత కాపు తాలూకు ఆనవాళ్లన్నింటికీ సమూలంగా తొలగిస్తారు. ఈ నేపథ్యంలో కొత్త పంట వచ్చేసరికి సమయం పడుతుంటుంది. అప్పటి వరకు దిగుబడి అంతగా ఉండదు. ఇదిలా ఉంటే కొన్నిచోట్ల పంట కొనసాగుతున్నప్పటికీ భారీగా వర్షాలు కురుస్తుండడం మూలంగా కూరగాయలను సేకరించే పరిస్థితి లేకపోవడం, ఒకవేళ సేకరించినా ట్రాన్స్‌పోర్ట్ సమస్యలు తలెత్తుతుండడంతో మార్కెట్లకు వచ్చే కూరగాయలు భారీగా తగ్గిపోయాయి. డిమాండ్‌కు తగ్గట్లుగా మార్కెట్లకు దిగుమతి జరగకపోవడంతో ధరలు కాస్తా ఎకబాకాయని మార్కెట్ నిపుణులు స్పష్టం చేశారు. 20 నుంచి 60 శాతం మేర కూరగాయల ధరలు పెరిగినట్లు మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి.

కర్రీ పాయింట్లకు పరుగులు..

చాలా మంది తమ వంటింట్లో కూరల ఘుమఘుమలకు చెక్ పెట్టేశారు. దీంతో బయట కర్రీ పాయింట్ల వద్ద తమకు తోచిన కూరలు తెచ్చుకుని సరిపెట్టుకోవాల్సి పరిస్థితులు తలెత్తాయి. ఒకప్పుడు బ్యాచ్‌లర్స్‌కే అన్నట్లుగా ఉండే కర్రీ పాయింట్లు, ఇప్పుడు ఫ్యామిలీలకు కేరాఫ్‌గా మారిపోయాయి. ముఖ్యంగా పెరిగిన కూరగాయల ధరలు సామాన్య, మధ్య తరగతి కుటుంబాలను కర్రీ పాయింట్ల వైపు నడిపించేలా చేస్తున్నాయి.

గత నెలతో పోలిస్తే ప్రస్తుత ధరలు..

కూరగాయ	రైతుబజార్	బయట మార్కెట్
టమాటా	47	80
బెండకాయ	50	85
పచ్చిమిర్చి	60	95
బజ్జీమిర్చి	65	95
క్యాప్సికమ్	70	95
పచ్చకాకర	47	75
పందిరిబీర	75	105
బీన్స్	135	160
గింజచిక్కుడు	55	80
గోకరకాయ	50	75
కీర	32	48
దోసకాయ	25	45
బీట్‌రూట్	23	45
ఉల్లిగడ్డ	35	55
ఆలుగడ్డ	35	68

వర్షాల ప్రభావంతోనే..

వర్షాల ప్రభావంతో చాలాచోట్ల పంటను సేకరించే పరిస్థితులు లేవు. అలాగే ట్రాన్స్‌పోర్ట్ సమస్య ఒకటి ప్రధానంగా ఉంది. దీనికి తోడు పాత పంటలు స్థానంలో కొత్త పంటలు వేసే సీజన్ కావడంతో రైతుబజార్‌కు వచ్చే కూరగాయల శాతం తగ్గింది. ఆ ప్రభావంతో కాస్త కూరగాయలు ధరలు పెరిగాయి. కొన్ని రోజుల్లో ఈ పరిస్థితులు సర్దుకుని సాధారణ ధరలకు వస్తాయి.

– రమేష్, రైతుబజార్ ఎస్టేట్ అధికారి

ప్రతి విద్యార్థికి సీటు ఇవ్వాలి



జయంతి గౌడ్

కాచిగూడ: గురుకుల పాఠశాలల్లో దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్క విద్యార్థికి సీటు కేటాయించాలని బీసీ మహిళా జేఏసీ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ మట్ట జయంతి గౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం కాచిగూడలో ఆమె మాట్లాడుతూ ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజులు చెల్లించలేక అనేక మంది పేదలు తమ పిల్లలను గురుకుల పాఠశాలల్లో చేర్పించేందుకు మొగ్గు చూపుతున్నారని పేర్కొన్నారు. గురుకుల పాఠశాలల్లో అందరికి సీట్లు రాకపోడంతో సీట్ల కోసం బ్రోకర్ల దందా ఎక్కువైపోయిందని, దీంతో నిరుపేద పిల్లల తల్లిదండ్రులు బ్రోకర్లకు డబ్బులు చెల్లించలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్, కార్పొరేటర్ పాఠశాలల్లో ఫీజులను నియంత్రించాలని దీంతో కొంత మంది ప్రైవేట్ స్కూళ్లలో చేరి చదువుకునే అవకాశం ఉంటుందన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి

కాచిగూడ: ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని డీవైఎఫ్‌ఐ హైదరాబాద్ నగర అధ్యక్షులు హస్మిబాబు, కార్యదర్శి జావిద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం కాచిగూడ విద్యుత్ ఏఈ మెగారాణిని వారు కలిసి వినతి పత్రం అందజేశారు. ముఖ్యంగా కాచిగూడ, అంబర్‌పేట, గోల్నాక, బాగ్ అంబర్‌పేట, నల్లకుంట తదితర ప్రాంతాల్లో పలు ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయని వారు తెలిపారు. డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో చేపట్టిన బస్తీ బాటలో వచ్చిన ప్రజా సమస్యలను ఆయా విభాగాల సంబంధిత అధికారులను కలిసి వినతి పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ నేతలు వేణు, అజయ్, క్రాంతి, రవి పాల్గొన్నారు.

తెలుగు సాహిత్యానికి శ్రీశ్రీ దిక్సూచి



సన్మానగ్రహీతలతో వీడీ రాజగోపాల్, జనార్ధనమూర్తి

చిక్కడపల్లి: తెలుగు సాహిత్యానికి శ్రీశ్రీ దిక్సూచిలా వెలుగొందారని ప్రభుత్వ మైన్స్ విశ్రాంత అధికారి డాక్టర్ వీడీ రాజగోపాల్ అన్నారు. సాహితీ సాంస్కృతిక సంస్థ రాగరాగిణీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి త్యాగరాయగానసభలో మహాకవి శ్రీశ్రీ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అభ్యుదయ కవితావాదిగా అద్భుతమైన సాహిత్యాన్ని సృష్టించారన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి మాట్లాడుతూ.. గానసభ అధ్యక్షుడు కళా జనార్థనమూర్తి మాట్లాడుతూ శ్రీ శ్రీ సినీగీతాలతో పాటు సాహితీ ప్రక్రియలన్నింటిని స్పృశించి సుసంపన్నం చేసారన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన నేను సైతం శ్రీశ్రీ గీత విభావరిలో గీత విభావరిలో గాయనీగాయకులు పాల్గొని ఎంపిక చేసుకున్న గీతాలను అలపించారు.

మెమొరీస్ ఆఫ్ ఆన్ అన్‌సంగ్ వారియర్ పుస్తకావిష్కరణ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం మాజీ అధ్యక్షులు డీపీ రెడ్డి రచించిన మెమొరీస్ ఆఫ్ ఆన్ అన్‌సంగ్ వారియర్ పుస్తకాన్ని శనివారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ జన సమితి అధ్యక్షులు ప్రొఫెసర్ కొదండరామ్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తన బాల్యం నుంచి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమించిన తీరును ఈ పుస్తకంలో రచించడం స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ రమామేల్కోటే, పీడీఎఫ్ కెనడా చైర్మన్ పెద్ది సురేందర్, ఇండియా అధ్యక్షులు మట్టా రాజేశ్వర్‌రెడ్డి, పాండురంగారావు, రణధీర్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో భాగస్వాములు కావాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సామాజిక సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సీనియర్స్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.పుల్లయ్య, మాచర్ల రంగయ్యలు తెలిపారు. శనివారం పద్మకాలనీ కమ్యూనిటీహాల్‌లో అసోసియేషన్ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గత నెలలో జరిగిన కార్యక్రమాలపై సమీక్ష, సభ్యులకు ఐడీ కార్డులు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సమాజ హితం కోసం పని చేసినప్పుడే మంచి గుర్తింపు లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కార్యనిర్వాహక కార్యదర్శి నర్సింగ్‌రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ భవానీ, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ వై.మురళీధరుడు, సుభాష్‌చంద్రబోస్, కోశాధికారి విఠల్ కులకర్ణి, డాక్టర్ నీలా శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశ్రీ స్ఫూర్తి నేటికీ కొనసాగుతోంది

కవాడిగూడ: శ్రీశ్రీ అందించిన స్ఫూర్తి నేటికీ కొనసాగుతోందని తెలంగాణ సాహితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ఆనందాచారి అన్నారు. శనివారం మహాకవి శ్రీ శ్రీ వర్ధంతి సందర్భంగా తెలంగాణ సాహితి ఆధ్వర్యంలో కవులు, రచయితలు ట్యాంక్‌బండ్‌పై గల శ్రీశ్రీ విగ్రహం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆంధ్ర సారస్వత పరిషత్తు పూర్వ ప్రధానాచార్యులు మోతుకూరు నరహరి తొలుత శ్రీశ్రీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కార్మిక, కర్షక పక్షం వహించిన తొలి కవి శ్రీ శ్రీ అని తెలిపారు. పిల్లల కోసం శైశవగీతిని రాశారని చెప్పారు. సభకు అధ్యక్షత కె. ఆనందాచారి అధ్యక్షత వహించారు.

గృహ కార్మికుల కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలి



కార్యక్రమంలో పాల్గొన్న ప్రజా సంఘాల నేతలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఇళ్లలో పని చేసే గృహ కార్మికుల కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాన్ని తీసుకువచ్చి అందులో ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలతో ఇతర డిమాండ్లను పరిష్కరించాలని వక్తలు డిమాండ్ చేశారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ గృహ కార్మిక సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ గృహ కార్మికుల దినోత్సవం జరిగింది. సంఘం అధ్యక్షురాలు ఆన్ జోసెఫ్, సలహాదారు సిస్టర్ లిస్సీ జోసెఫ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర మైనార్టీ కమీషన్ చైర్ పర్సన్ దీపక్ జాన్, పివోడబ్ల్యూ జాతీయ కన్వీనర్ సంధ్య, ప్రజా సంఘాల నేతలు ఝాన్సీ, సజయ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన పైప్‌లైన్‌తో కలుషిత నీటికి చెక్

ఎమ్మెల్యే ముఠా గోపాల్



డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్ కార్పొరేటర్ జి. రచనశ్రీ

కవాడిగూడ: ముషీరాబాద్ నియోజకవర్గంలో జనాభాకు అనుగుణంగా మంచి నీటి, డ్రైనేజీ పైప్‌లైన్లను ఆధునీకరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. శనివారం కవాడిగూడ డివిజన్ దోమలగూడ పూల్‌బాగ్‌లో రూ.17లక్షల రూపాయలతో నిర్మించే డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు ఎమ్మెల్యే ముఠా గోపాల్ స్థానిక కార్పొరేటర్ జి. రచనశ్రీలు హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... స్థానికుల విజ్ఞప్తి మేరకు పూల్‌బాగ్ బస్తీలో కలుషిత నీటి సరఫరా అడ్డుకట్ట వేసేందుకు జనాభాకు అనుగుణంగా డ్రైనేజీ పైప్ లైన్ వేస్తామన్నారు. నూతన డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణంతో స్థానిక ప్రజల ఇబ్బందులు తొలగిపోతాయని అన్నారు. బస్తీలో ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ టి.రవీందర్, బీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర నాయకులు ముఠా జైసింహ, బీజేపీ రాష్ట్ర నాయకులు జి. వెంకటేష్, పరిమళ్‌కుమార్ పాల్గొన్నారు.

నీటి సమస్యను పరిష్కరించండి



సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్

కాచిగూడ: మణియార్ పట్టిలో కొంత కాలంగా ప్రజలు మంచినీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మంచినీటి నల్లాల్లో కలుషిత నీరు వస్తోందని, దీనికి తోడు లో ప్రెషర్ కారణంగా మరి కొన్ని ప్రాంతాల్లో నీరే సరిగ్గా రావడం లేదని స్థానికులు తెలిపారు. శనివారం స్థానికుల నుంచి అందిన పిర్యాదు మేరకు శనివారం కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్, జలమండలి అధికారులు, సిబ్బందితో కలిసి డివిజన్ లోని మణియార్ పట్టి, చెప్పల్‌బజార్, మోతీ మార్కెట్ తదితర ప్రాంతాల్లో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మంచినీటి సరఫరా సమయాన్ని మార్చాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల సత్వర పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జలమండలి ఏఈ భావన, బీజేపీ నేతలు కన్నె రమేష్ యాదవ్, ఆర్.సంతోష్, ఓంప్రకాష్, నాగరాజు, ఎస్.రవియాదవ్ పాల్గొన్నారు.

బక్రీద్ సందర్భంగా ఏర్పాట్లు పూర్తి

అంబర్‌పేట: బక్రీద్ పర్వదినానికి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నట్లు బాగ్ అంబర్‌పేట కార్పొరేటర్ బి.పద్మావెంకట్‌రెడ్డి తెలిపారు. శనివారం డివిజన్ పరిధిలో ఉన్న వివిధ మసీదుల వద్ద అపరిశుభ్రత లేకుండా కవర్లను పంపిణీ చేశారు. మసీదుల్లో కావాల్సిన ఏర్పాట్లు చేసినట్లు ఆమె వెల్లడించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ పారిశుధ్య విభాగం సిబ్బంది హరినాథ్‌గౌడ్, ఆంజనేయులు, బీఆర్ఎస్ నాయకులు చంద్రమోహన్, అప్రోజ్‌పటేల్, వెంకటరమణ, రమేశ్‌నాయక్ పాల్గొన్నారు.



మసీదు నిర్వాహకులకు కవర్లు అందజేస్తున్న కార్పొరేటర్ పద్మా వెంకట్‌రెడ్డి

రాధక్కకు సంతాపం



చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

ముషీరాబాద్: తుది శ్వాస వరకు నమ్ముకున్న సిద్ధాంతం కోసం కట్టుబడి పని చేసిన పోరాట యోధురాలు రాధక్క అని పలువురు వక్తలు కొనియాడారు. శనివారం విద్యానగర్‌లో సిపిఐఎంఎల్ సీనియర్ నాయకురాలు, గోదావరి లోయ ప్రతిఘటనోద్యమ నాయకురాలు రాధక్క సంతాప సభ జరిగింది. అంతకు ముందు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆమె నమ్మిన సిద్ధాంతాన్ని ముందుకు తీసుకుపోవడమే రాధక్కకు అర్పించే నిజమైన నివాళ్లు అని పలువురు పార్టీ నాయకులు విజయ్, సరళ తదితరులు స్పష్టం చేశారు.

కేజీబీవీ నాన్ టీచింగ్ సిబ్బంది జీతాలు పెంచాలి

ముషీరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో ఉన్న 475 కస్తూర్బా పాఠశాలల్లో, 300 కళాశాలల్లో పని చేస్తున్న నాన్ టీచింగ్ సిబ్బంది జీతాలు పెంచాలని ప్రగతిశీల కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల నాన్ టీచింగ్, వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.ఎల్.పద్మ డిమాండ్ చేశారు. శనివారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో కేజీబీవీ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఎస్.ఎల్.పద్మ మాట్లాడుతూ పని భారం వల్ల అనేక పాఠశాలల్లో నాన్ టీచింగ్ సిబ్బంది ఉద్యోగాలు వదిలేసి వెళ్తున్నారని దాన్ని వల్ల ఉన్న వారిపై పని భారం పెరిగిందని కాబట్టి తక్షణమే ఖాళీగా ఉన్న పోస్టులన్నిటిని భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కళాశాలలుగా అప్‌డేట్ అయిన చోట కొత్త నియామకాలు చేపట్టాలని ప్రభుత్వ ఉద్యోగాల్లో కేజీబీవీ సర్వీస్‌కు వెయిటేజీ మార్కులు ఇవ్వాలని, ఏఎన్ఎంలకు నైట్ డ్యూటీలను తగ్గించాలని, మెడికల్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, రిటైర్‌మెంట్ అయిన నాన్ టీచింగ్ సిబ్బందికి 5–10 లక్షల రూపాయల హానరోరియం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టియూ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యం, అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.



రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న ఎస్.ఎల్.పద్మ

23న ఐఎఫ్‌టీయూ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ముషీరాబాద్: తెలంగాణ రాష్ట్ర ఐఎఫ్‌టియూ జనరల్ కౌన్సిల్ సమావేశం జూన్ 23 ఇల్లందు పట్టణంలో జరుగుతుందని కార్మికులంతా పెద్ద ఎత్తున ఈ జనరల్ కౌన్సిల్ సమావేశాల్లో పాల్గొనాలని ఐఎఫ్‌టియూ నాయకులు పేర్కొన్నారు. ఈ జనరల్ కౌన్సిల్‌కు సంబంధించిన వాల్ పోస్టర్‌ను శనివారం విద్యానగర్‌లో ఆవిష్కరించారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న రూపా

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఎంబీఏ విద్యార్థులు తమతో వచ్చిన ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోని ఉన్నత స్థాయిలో రాణించాలని ప్రముఖ విద్యావేత్త రూపా అన్నారు. శనివారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఎంబీఏ కళాశాలలో ఎంబీఏ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులకు ప్లే ఇంటర్నేషనల్ లిమిటెడ్ కంపెనీ నుంచి ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా రూపా మాట్లాడుతూ ప్రతిభ ఉన్న వారికి ఎప్పటికైనా అవకాశాలు లభిస్తాయని అన్నారు. విద్యార్థులు తమ నైపుణ్యాన్ని పెంచుకోని వృత్తిలో రాణించాలని తెలిపారు.

రైలు ఢీకొని సెంట్రింగ్ కార్మికుడు మృతి

కాచిగూడ: రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... సైదాబాద్ ప్రాంతానికి చెందిన బాల మైసయ్య కుమారుడు రాజు (22) సెంట్రింగ్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. శనివారం మలక్‌పేట రైల్వే స్టేషన్ వద్ద రైల్వే ట్రాక్ వెంట నడుచుకుంటూ వెళ్తుండగా ఎంఎంటీఎస్ రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనాథగా మారిన విద్యాశాఖ



అనిల్‌కు నియామకపు పత్రాన్ని అందజేస్తున్న ఆర్.కృష్ణయ్య, వేముల రామకృష్ణ

కాచిగూడ: పర్యవేక్షణ లేని అనాథగా విద్యాశాఖ మారిందని బీసీ విద్యార్థి సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆందోళనవ్యక్తం చేశారు. బీసీ విద్యార్థి సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా అనిల్‌కు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, వేముల రామకృష్ణలు శనివారం నియామకపు పత్రాన్ని అందజేశారు. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ భావి భారత పౌరులను తీర్చిదిద్దే విద్యాశాఖకు నేటి వరకు మంత్రిని ఏర్పాటు చేయకపోవడం శోచనీయమన్నారు. విద్యాశాఖను చూస్తున్న సీఎం రేవంత్ రెడ్డి ఏ ఒక్కరోజు కూడా విద్యాశాఖ గూర్చి పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. విద్యాశాఖకు మంత్రి లేకపోవడంతో సమస్యలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠ్యపుస్తకాల ముద్రణ సమయంలో పర్యవేక్షణ లేక తప్పులు దొర్లి రాష్ట్ర ఖజానాపై అదనపు భారం పడిందన్నారు. రాష్ట్రంలో 2,667 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా 33 జిల్లాల్లో 26 జిల్లాలకు జిల్లా విద్యాశాఖ అధికారులు (డీఈఓ) లేరన్నారు. పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలని, సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం నేతలు ప్రవీణ్, సాయి వర్ధన్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పూర్తిచేయాలి

చిక్కడపల్లి: డివిజన్‌లోని అభివృద్ధి పనులను పూర్తిచేయాలని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ అధికారులను కోరారు. శనివారం డివిజన్‌లోని కార్పొరేటర్ కార్యాలయంలో జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులతో ఆమె సమీక్షావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డీఈ గీతా ఏఈ అబ్దుల్‌సలామ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్ పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షావేశం నిర్వహిస్తున్న కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్

విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ



కవాడిగూడ: పేద విద్యార్థులకు చేయూత నందించడమే లక్ష్యంగా భారత్ సేవాశ్రమ్ సంఘ్ ముందుకు సాగుతోందని సంస్థ నగర అధ్యక్షుడు స్వామి మునిశ్వారనంద తెలిపారు. శనివారం ఆలియా ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐఏఎస్ అధికారి దేవసేన హాజరయ్యారు. 150 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేశారు. భారత్ సేవాశ్రమ్ సంఘ్ ప్రధాన కార్యదర్శి స్వామి వెంకటేశ్వర నంద మహారాజ్, పాఠశాల ప్రిన్సిపాల్ జి. విశ్వనాథం గుప్తా పాల్గొన్నారు.

ఆర్ఎంపీ, పీఎంపీలపై దాడులు ఆపండి



సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన ఆర్ఎంపీ, పీఎంపీల సంక్షేమ సంఘం సభ్యులు

ముషీరాబాద్: డ్రగ్ కంట్రోల్, పోలీసు అధికారులు సోదాల పేరుతో తమను ఇబ్బంది పెడుతున్నారని, వాటిని ఆపేపలా చర్యలు తీసుకోవాలని ఆర్ఎంపీ, పీఎంపీల సంక్షేమ సంఘం సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేసింది. రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు నేతి రాజేశ్వరరావుతో పాటు సంఘం నేతలు పి.హన్మంతరావు, మనోహర్‌రావు, అశోక్, రాజు సీఎంను కలిసి తమ సమస్యల పరిష్కారానికి వినతిపత్రం అందజేశారు. 2008లో అప్పటి వైఎస్ ప్రభుత్వం ఇచ్చిన జీవో 429 ప్రకారం ఆర్ఎంపీలు, పీఎంపీలు శిక్షణ పొందారని సీఎంం దృష్టికి తీసుకెళ్లారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ఆర్ఎంపీ, పీఎంపీలకు డాక్టర్ సర్టిఫికెట్లు ఇవ్వాలని, అప్పటి జీవోను కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం నేతి రాజేశ్వరరావు మాట్లాడుతూ ఆర్ఎంపీ, పీఎంపీలకు ధృవీకరణ పత్రాలు ఇస్తామని సీఎం హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో పి.వెంకటేశ్వర్‌రావు, రవీందర్ పాల్గొన్నారు.

మీ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతా

ప్రొఫెసర్ కోదండరామ్



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరామ్

నల్లకుంట: బస్తీ దవాఖానల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలంగాణ జన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ చెప్పారు. శనివారం నల్లకుంట ఫీవర్ ఆసుపత్రిలోని టీఎంహెచ్ ఈయూ కార్యాలయంలో తెలంగాణ బస్తీ దవాఖాన కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల అసోసియేషన్ ప్రథమ కార్యవర్గ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన కోదండరామ్ మాట్లాడారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాల చెల్లింపును కాంటాక్టర్ల ద్వారా చెల్లిండం ద్వారా ఇటు ఉద్యోగులు, అటు ప్రభుత్వానికి లబ్ధి చేకూరడం లేదన్నారు. ఈ కారణంగా పనిచేసేది ఒకరైతే లాభపడుతున్నది మధ్యవర్తులని పేర్కొన్నారు. ప్రభుత్వం నేరుగా వేతనాలు చెల్లించాలి, లేదా ఏదైనా ఒక కార్పొరేషన్ ఏర్పాటు చేసి కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు నేరుగా వేతనాలు చెల్లించాలి అన్నారు. సమస్యను గుర్తించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంబంధించి ఒక కమిటీ వేసిందని తెలిపారు. టీఎంహెచ్ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు రాబర్ట్ బ్రూస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మెడికల్ జేఏసీ కన్వీనర్ జాలిగామ అశోక్ పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220383